క్లుప్తంగా

హమాలీల సంఘం ఏడో మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

సామర్లకోట: బెవరేజ్ హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపో హమాలీల యూనియన్ 7వ మహాసభ స్థానిక బాట్లింగ్ యూనిట్‌లో ఆదివారం ఏర్పాటు చేశారు. రాష్ట్ర హమాలిల సంఘం కార్యదర్శి వి.కొండలరావు, సీపీఎం జిల్లా కార్యదరి కరణం ప్రసాదరావు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక సంఘ అధ్యక్షుడిగా విశ్వనాథల అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఉపాధ్యక్షుడిగా బుర్రే ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా అమలుకంటి సోమేష్, సహాయ కార్యదర్శిగా బైరెత్తి సత్యనారాయణ, కోశాధికారిగా సక్కా నాగేశ్వరరావు, కమిటీ సభ్యులుగా వై.శ్రీనివాసు, యు.సతీష్, బొడ్డు.వెంకటేష్, బిక్కిన శ్రీనివాసు, వెన్నల గోవిందు, పెంకే ఏడుకొండలను ఎన్నుకున్నారు.

దాత సహకారంతో బోరు ఏర్పాటు



బోరును ప్రారంభించిన బాబు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం వద్ద విశాఖపట్టణానికి చెందిన దాత సారిపల్లి కిశోర్ సుమారు రూ. 4 లక్షలతో ఆలయ కోనేరు వద్ద బోరు ఏర్పాటు చేశారు. కౌడా చైర్మన్ తుమ్మల బాబు ఆదివారం దీనిని ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



క్షతగాత్రులను 108లో ఎక్కిస్తున్న స్థానికులు

సామర్లకోట: వీకే రాయపురం గ్రామానికి చెందిన భార్యభర్తలు ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం సామర్లకోట వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో కాకినాడ రోడ్డులో వీకే రాయపురం సమీపంలోని పెట్రోలు బంకు వద్ద రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీ కొంది. దాంతో ఆ గ్రామానికి చెందిన పప్పుల శ్రీను, అతని భార్య తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను 108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఆర్‌పీఎస్ సంబరాలు

పిఠాపురం: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై ఆదివారం ఎంఆర్‌పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. గొల్లప్రోలు అరుంధతీయపేటలో మహిళలు యువకులు పాల్గొని స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు.

ఆలోచింపజేసిన నాటికలు

పెద్దాపురం: మనిషిని మనిషిగా చూపించేదే నిజమైన కళ అని, అది నాటక పరిషత్ ద్వారా సాధ్యపడుతుందని ఏపీ సాంస్కృతిక నాటక పరిషత్‌ల సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు, అల్లూరి సీతారామరాజు, కళా పరిషత్ అధ్యక్షులు పంపన దయానందబాబు, ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తెం కోటి అన్నారు. మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహా ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి షష్టమ ఉభయ రాష్ట్రాల తెలుగు నాటక కళాపరిషత్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం గుంటూరు అమరావతి ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన చిగురు మేఘం నాటికను కావూరి సత్యనారాయణ రచించగా, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. అలాగే హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ బృందం ఆకురాతి భాస్కరచంద్ర రచించగా, ఎం.బాషా దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఇది రహదారి కాదు' నాటికలు ఆకట్టుకున్నాయి.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కొత్తపల్లి: ఒక బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాగులపల్లికి చెందిన గుర్రాల శ్రీనివాసరెడ్డి కుమార్తెను ఫోన్ ఎక్కువగా చూస్తున్నావని మందలించాడు. శనివారం బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం పతాకావిష్కరణ చేస్తున్న ఆర్డీవో శ్రీరమణి



పోలీస్ స్టేషన్ వద్ద పతాకావిష్కరణ చేస్తున్న ఎస్ఐ మౌనిక



ఈటీసీలో జాతీయ జెండా ఎగురవేసిన ప్రిన్సిపాల్ వేణుగోపాల్



పిఠాపురం సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో..

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

- ఘనంగా గణతంత్ర వేడుకలు
- పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా జాతీయ పతాక ఆవిష్కరణలు

సామర్లకోట: గణతంత్ర వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. విస్తరణ శిక్షణ కేంద్రంలో ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరీ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కేఎస్ఎన్ విద్యా సంస్థలలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఈటీసీ ఫ్యాకల్టీలు పి. శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, బి ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దారు పద్మజారెడ్డి, వీఆర్వోలు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంఈఓలు వై.శివ రామకృష్ణయ్య, ఏపీఓ ప్రభాకరరావు, పరిపాలనాధికారి సతీష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు. అలాగే కౌడా చైర్మన్ తుమ్మల బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎ.శ్రీవిద్య జాతీయ జెండా ఎగుర వేయగా చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. పోలీసు స్టేషన్‌లో సీఐ ఎ.కృష్ణభగవాన్ జాతీయ పతాకాన్ని ఎగుర వేయగా ఎస్సైలు మూర్తి, అడపా గరగారావు, ఏఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ ఆవరణలో స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, ఆర్పీఎఫ్ స్టేషన్ వద్ద ఎస్సై రామకృష్ణ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సబ్ రిజిస్ట్రార్ జీవీవీ సత్యనారాయణ, సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టరు అమల, సచివాలయాల వద్ద అడ్మిన్లు, పంచాయతీ కార్యాలయాల వద్ద కార్యదర్శులు, పాఠశాలలల్లో హెచ్ఎంలు జాతీయ పతాకాలను ఎగుర వేశారు.



పిఠాపురంలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



విరవాడ జెడ్పీ హైస్కూల్లో 250 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు

పెద్దాపురంలో..

పెద్దాపురం: 76వ గణతంత్ర దినోత్సవాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశ సమైక్యతను చాటుతూ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జాతీయ జెండా రెపరెపలాడింది. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కె.శ్రీరమణి పతాకావిష్కరణ చేశారు. డీఎస్పీ కార్యాలయం వద్ద డీఎస్పీ శ్రీహరిరాజు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ మౌనిక, మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ ప్రకాశరరావు, పతాకావిష్కరణ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి హాజరయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీలలిత పతాకావిష్కరణ చేయగా జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా తదితరులు హాజరయ్యారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏ దైవకుమార్, నవోదయ విద్యాలయలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య జాతీయ పతాకాలను ఎగుర వేశారు.

శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో

స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆర్.సంతానం, అకడమిక్, కల్చరల్ కో-ఆర్డినేటర్లు, అధ్యాపక బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

పిఠాపురం: 76వ భారత గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం పిఠాపురం పట్టణం, మండలం, గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలాల్లో ఘనంగా నిర్వహించారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత తన కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించి రాజ్యాంగ విలువలను వివరించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోను అధికారుల ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయా మున్సిపల్ పాఠశాలల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా వార్డుల కౌన్సిలర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, పిఠాపురం ఎంపీడీఓ కార్యాలయం, పిఠాపురం సర్కిల్ కార్యాలయా లలో అధికారులు నిర్వహించిన గణతంత్ర వేడుకలలో మహాత్మా గాంధీ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రవికుమార్, పోలీసు స్టేషన్‌లో ఎస్సై వెంకటేష్, తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు చిన్నారావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు. కొత్తపల్లి ఊర చెరువు సెంటర్లో బీజేపీ నాయకులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.



పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న కమిషనర్ కనకారావు



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి



నాటి గురువులతో వీర్రాజు హైస్కూల్ 1969-70 బ్యాచ్ విద్యార్థులు

ఏడు పదుల ముచ్చట!

పెద్దాపురం: స్థానిక వీర్రాజు హైస్కూల్ 1969-70 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. 70 ఏళ్ల వయసులో కలుసుకుని వారు నాడు తిరుగాడిన ప్రదేశాలు, తరగతులను చూసి మురిసిపోయారు. తమకు చదువు నేర్పిన లెక్కల మాస్టారు కంభంపాటి గౌరీపతి శాస్త్రి, డ్రిల్ మాస్టార్ డి.స్టీవెన్స్‌ను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ వెలుగుతున్న దీపం మాత్రమే ఇతర దీపాలకు వెలుగు పంచగలదని, నిరంతర అధ్యయనం ద్వారా మాత్రమే ఇతరులకు జ్ఞానాన్ని పంచగలమన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారి చిన్ననాటి ముచ్చట్లలో మునిగితేలిపోయారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ముప్పన శ్యామలాంబ, పూర్వ విద్యార్థులు ముప్పన వీర్రాజు, ఎంద్రు రామారావు, ముత్యాల రాజబ్బాయి, మలిరెడ్డి సత్యన్నారాయణ, తోట మల్లేశ్వరరావు,చల్లా కొండ లక్ష్మీపతిరావు, చల్లా విశ్వనాథం, కొట్టి తంబి, చల్లా మల్లేశ్వరి, చప్పటి అనంతలక్ష్మి, జెట్టి వీర్రాజు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేనివాడిగా నటించి వాహనం చోరీ



మోటారు సైకిల్‌తో వెళ్తున్న వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేస్తున్న పెట్రోల్ బంకు సిబ్బంది

పిఠాపురం: నిత్యం రద్దీగా ఉండే పెట్రోల్ బంకు వద్ద ఒక వ్యక్తి ఒంటి మీద చొక్కా కూడా మతిస్థిమితం లేనివాడిగా నటిస్తూ ఓ వాహనాన్ని తీసుకుని ఉడాయించాడు. గొల్లప్రోలు పోలీసుల కథనం ప్రకారం గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన గారపాటి వెంకటరాజు పెట్రోలు కొట్టించుకోడానికి చేబ్రోలు 216 జాతీయ రహదారిలో ఉన్న పెట్రోల్ బంకుకు ఆదివారం వెళ్లాడు. పెట్రోలు కొట్టించుకుని ఆన్‌లైన్ పేమెంటు కోసం పక్కనే ఉన్న క్యూఆర్ కోడ్ వెళ్లగా అంతలో అక్కడే మతి స్థిమితం లేనివాడిగా నటిస్తున్న ఓ వ్యక్తి అతడి బండి తీసుకుని పరారయ్యాడు. ఆ వ్యక్తిని ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేక పోవడంతో వెంకటరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు అన్ని పోలీసు స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. బంకులోని సీసీ కెమెరాల్లో దృశ్యాలను ఇతర పోలీసు స్టేషన్లకు పంపి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. కాగా బండితో పరారైన వ్యక్తి శ్రీకాకుళంలో అతడు దొంగిలించిన మోటారు సైకిల్‌తో ఒక ఎడ్లబండిని ఢీకొట్టినట్లు సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. ఈ సమచారం మేరకు పోలీసులు శ్రీకాకుళం వెళ్తున్నట్టు తెలిసింది.

యథేచ్ఛగా మాసం, చేపల విక్రయాలు

సామర్లకోట: గణతంత్ర దినోత్సవం రోజున సైతం చేపలు, మాంసం విక్రయాలు పట్టణంలో జోరుగా జరిగాయి. ఐదు తూముల వద్ద చేపలు, నెంబరు 1, 2 మార్కెట్‌లో చేపలు, మాంసం విక్రయాలు చేశారు. విషయం తెలుకుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టరు తన సిబ్బందితో దాడులు చేసి చేపలు, మాంసాలను స్వాధీనం చేసుకున్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: గణతంత్ర దినోత్సవ సందర్భంగా మద్య మాంసాల విక్రయాలు విరివిగా సాగాయి. స్థానిక ఎక్సైజ్ అధికారులు మాత్రం తాము దాడులు నిర్వహించి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. మండలంలోని దివిలిలో కూటమికి చెందిన ఓ జనసైనికుడి నుంచి భారీగా మద్యంను పట్టుకున్నా సంబంధిత శాఖాధికారులు మాత్రం ఎందుకు బయటపెట్టలేదంటూ టీడీపీ నేత ఆరోపించారు. దీనిపై ఎక్సైజ్ ఎస్సై చిట్టిబాబును వివరణ కోరగా దివిలిలో భారీ మొత్తంలో మద్యం దొరికిందన్న వార్తల్లో వాస్తవం లేదన్నారు.

మరిడమ్మ ఆలయానికి భక్తుల రద్దీ



ఆలయంలో నిర్వహించిన అన్నదానం

పెద్దాపురం: భక్తుల కల్పవల్లి మరిడమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వారం వారం నిర్వహించే నిత్య అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ పట్టణానికి చెందిన కొత్త విశ్వజిత్ సహకారంతో అన్నదానం నిర్వహించినట్టు తెలిపారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా అమ్మవారి పుట్టిలు సామర్లకోటకు సాగనంపే సందర్భాన్ని పురస్కరించుకుని ఆరో తేదీన అమ్మవారి తొలి గరగల ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ ఈ ఉత్సవంలో భాగస్వాములు కావాలని ఈఓ విజయలక్ష్మి కోరారు.

లారీ ఢీకొని గేదె మృతి

కొత్తపల్లి: పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో ఆదివారం అధిక ఇసుక లోడుతో వెళ్తున్న లారీ ఒక గేదెను ఢీ కొట్టడంతో ఆ మూగజీవి అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలోని వాకతిప్పకు చెందిన వాసంశెట్టి సతీష్‌కు చెందిన గేదెను మేతకు తీసుకువెళ్లి ఇంటికి తీసుకువస్తుండగా పిఠాపురం వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ కొత్తపల్లి పీహెచ్‌సీ వద్ద గేదెను ఢీ కొట్టింది. గేదె విలువ సుమారు రూ.1.5 లక్షలు ఉంటుందని సతీష్ తెలిపాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

సామర్లకోట/పెద్దాపురం/పిఠాపురం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం తదితర ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తు విశేష సేవలందించిన అధికారులు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. వారి వివరాలు ఇలా.. సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ జీవీవీ సత్యనారాయణ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.

రెవెన్యూ సిబ్బందికి పురస్కారాలు

సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి కాకినాడ ఆర్డీఓ కార్యాలయంలో ఎస్.మల్లిబాబు ఉత్తమ పురస్కారాలు అందజేశారు. వీఆర్వోల సంఘ అధ్యక్షుడు మామిడాల కామరాజు, ఉండూరు వీఏఓ మోర్త దిలీప్, ఉండూరు సచివాలయ గ్రామ సర్వేయర్ సీహెచ్ నరసింహమూర్తి అందుకున్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయా విభాగాల సిబ్బంది ఆదివారం ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు. ఉత్తమ ఎన్నికల ఆపరేటర్‌గా ఆర్.ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ వై.భారతి, సీనియర్ సహాయకులు ఏఎన్‌వీవీ నారాయణ, ఆర్డీఓ సీసీ విలేజ్ సర్వేయర్ పి. రమేష్‌కుమార్, సబార్డినేట్ కె.సన్యాసిరావు, డ్రైవర్ కె.బాబ్జీ ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరు కాకినాడ పేరెడ్ గ్రౌండ్‌లో ఆదివారం కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీల నుంచి పురస్కారాలను అందుకున్నారు.

కొత్తపల్లి: కాకినాడ ఆర్డీఓ మల్లిబాబు గోర్స, యండపల్లి-1, 2 వీఆర్ఓలు కుర్ల జగదీష్, గంగరాజు, తమ్మారావు, పొన్నాడ గ్రామ సర్వేయర్ గుంటుబోయిన శ్రీనులకు ఉత్తమ పురస్కారాలు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ ధూళిపాళ వెంకట మురళీకృష్ణ ఉత్తమ పురస్కారం అందుకున్నారు.



(కుడి నుంచి ఎడమ వైపు) జిల్లా కలెక్టర్ షణ్మోహన్ నుంచి అవార్డులు స్వీకరిస్తున్న ఎన్నికల ఆపరేటర్ ప్రసాద్, డీటీ భారతి, సీనియర్ సహాయకులు ఏఎన్‌వీవీ నారాయణ, సీసీ రమేష్ కుమార్, సబార్డినేట్ కె.సన్యాసిరావు, డ్రైవర్ బాబ్జీ, పిఠాపురం ఉద్యాన శాఖాధికారి కేఎస్ శైలజ, పిఠాపురం వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు విజయ జనార్దనాచార్యులు



కాకినాడ ఆర్డీఓ నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సామర్లకోట వీఆర్వో కామరాజు



(కుడి నుంచి ఎడమ వైపు) జిల్లా కలెక్టర్ షణ్మోహన్ నుంచి అవార్డులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దారు వెంకట మురళీకృష్ణ, అవార్డు అందుకుంటున్న ఎంపీడీఓ చిన్నారావు, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు, సామర్లకోట సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ